RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 11 మంగళవారం 30-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

### చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డ భారతి

కడప,ఏప్రిల్29: ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని సిఎం జగన్ సతీమణి వైఎస్ భారతి ఆక్షేపించారు.. చంద్రబాబు వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. సీఎం జగన్ పాలనపై ప్రజలు సంతోషగా ఉన్నారని భారతి అన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. పులివెందులలో అభివృద్ధి లేదనే వారికి కళ్లు లేవు అనుకోవాలి. పులివెందులలో ఎంతో అభివృద్ధి జరిగింది. చంద్రబాబు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రజాజీవితంలో ఉన్నవారు విచక్షణతో మాట్లాడాలి. చంద్రబాబు నాయుడు వయసులో పెద్దవారు. ఆయన అలా మాట్లాడటం తప్పు. ఒక వ్యక్తిని చంపాలనుకోవడం తప్పు ఏమైనా ఉంటే ప్రజల వద్ద తేల్చుకోవాలి. ఇది ఆయన విక్షణకే వదిలేస్తున్నాం. ప్రజలను మెప్పించుకోవాలి కానీ, అడ్డు తొలగించుకోవాలనుకోవడం దారుణం అని భారతి అన్నారు. ఇదిలా ఉంటే.. వైఎస్ భారతి ప్రచారానికి పులివెందుల ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# చంద్రబాబును నమ్మితే అంతే సంగతులు



### కొండచిలువ నోట్లో తలపెట్టడమే
### విలువలు,విశ్వసనీయతలేని వ్యక్తి బాబు
### దుష్టచతుష్టయంతో పోరాడుతున్నా
### బాబు గెలిస్తే సంక్షేమ పథకాలు మాయం
### పొన్నూరు సభలో జగన్ హెచ్చరిక

గుంటూరు,ఏప్రిల్29 : చంద్రబాబును నమ్మడమంటే కొండచిలువ నోట్లో తలపెట్టడమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ఎలాంటివాడో చెప్పడానికి 2014 కూటమి మేనిఫెస్టో సరిపోతుందని మండిపడ్డారు. విలువలు, విశ్వసనీయత లేని బాబు.. ఎన్నికలయ్యాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేస్తాడని విమర్శించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం జగన్.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై నిప్పులు చెరిగారు. జననేత రాకతో పొన్నూరులో పండుగ వాతావరం నెలకొంది. సీఎం నినాదాలతో ప్రచార సభ మార్మోగిపోయింది. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. మరో రెండు వారాల్లో కురుక్షేత్ర సంగ్రామం జరగబోతుందన్నారు. ఈ యుద్ధంలో ఓ వైపు కౌరవ సేన, దుష్ట చతుష్టయం ఉందని విమర్శించారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు అందరినీ మోసం చేసిన చరిత్ర ఆ కూటమిని దుయ్యబట్టారు. ఆయనకు మద్దతుగా రెండు జాతీయ పార్టీలు, ఉన్నాయని ఒక వదినమ్మ, ఒక దత్తపుత్రుడు, కొన్ని మీడియా సంస్థలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికీ మేలు చేసిన చరిత్రలేని వీళ్లంతా కూటమిగా చేరి ఇంటింటికీ మంచి చేసిన ఒకే ఒక్కడైన మీ జగన్‌తో యుద్ధం చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ నమ్ముకున్నది మిమ్మల్ని, పైనున్న ఆ దేవుడినే అని తెలిపారు. జగన్ పొత్తు ప్రజలతోనే ఉంన్నారు. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్లకు ప్రజల ఇంటి అభివృద్ధిని నిర్ణయించేవన్నారు. పేదల తలరాతలను నిర్ణయించేవని చెప్పారు. వైఎస్ జగన్‌కు ఓటేస్తే పథకాలన్నీ కొనసాగుతాయని.. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పతకాలన్నీ ఆగిపోతాయని తెలిపారు. ఈక్రమంలో కూటమి నేతలపై వ్యాఖ్యలను తీవ్రతరం చేశారు. ముఖ్యంగా చంద్రబాబు పై విమర్శలు చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు సాధ్యం కాని హామీలతో మరోసారి మోసం చేస్తున్నారని, బాబును నమ్మడమంటే పులినోట్లో తలకాయ పెట్టినట్లేనని ఆరోపించారు. వైసీపీ అమలు చేసిన పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ తిరిగి అధికారంలోకి రావాలని, చంద్రబాబుకు వేస్తే పథకాలు ముగింపు అవుతాయని పేర్కొన్నారు. 14 ఏండ్ల పాటు సీఎంగా పనిచేసినా చంద్రబాబు గుర్తుకు వచ్చే పథకాలు ఏమైనా ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. పేదలకు ఏ ఒక్క మంచి పథకాలు లేవని ఆరోపించారు. జన్మభూమి కమిటీల మీద నమ్మకం ఉంటే అధికారంలో వస్తే తిరిగి ధైర్యంగా పునరుద్ధరిస్తావా లేదా అంటూ నిలదీశారు. వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తీసుకొస్తానని వెల్లడించారు. 2014లోనూ జనసేన, బీజేపీతో కూటమి కట్టి ఎడాపెడా వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి ప్రజల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. రైతుల రుణమాఫీ, పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేయలేదని దుయ్యబట్టారు. ఆడబిడ్డ పుట్టిన వెంటనే రూ. 25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామని అన్నారు. ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ. 200. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు తలరాతలు రాసే ఎన్నికలని, ప్రజలు ఆలోచించి మంచి చేసే పార్టీకి ఓటు వేయాలని కోరారు.సీఎం జగన్ పూర్తి ప్రసంగం విశ్వసనీయత ఉన్న ఈ ప్రభుత్వం మీద విలువలు లేని చంద్రబాబు ఎలా నోరుపారేసుకుంటున్నారో వింటున్నారు కదా అని అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఏం చేశాడో చెప్పకుండా జగన్‌ను తిడుతున్నాడు. చంద్రబాబు నన్ను ఒక బచ్చా అంటున్నాడు. పోయేకాలం వచ్చినప్పుడు విలన్‌లందరికీ హీరో బచ్చాలనే కనిపిస్తాడు. నువ్వు బచ్చా అంటున్న నేను ఎన్నికల్లో ఒంటరిగా నిలబడి ధైర్యంగా పోరాడుతున్నానని సవాల్ చేశారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తు వచ్చే ఒక్కమంచి పథకం అయినా ఉందా అన్నారు. చంద్రబాబు ప్రజలకు తాను చేసిన మేలు చెప్పి ఓట్లు ఎందుకు అడగలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, సున్నావడ్డీ, ఈబీసీ నేస్తం, వాహనమిత్ర, పెన్షన్ వంటి పథకాలు నువ్వు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఐదేళ్లలో నేను అమలు చేసిన పథకాలనే అమలు చేస్తానని ఎందుకు చెబుతున్నావని అన్నారు. గత మేనిఫెస్టోలో చెప్పినవి 99 శాతం హామీలు అమలు చేశాం. లంచాలు, వివక్ష లేకుండా రూ. 2 లక్షల 70 వేల కోట్లు అందించాంనాడు-నేడుతో విద్యా, వైద్య రంగంలో మార్పులు తీసుకొచ్చాం. 31 లక్షల ఇళ్ల పట్టాలు,. 22 లక్షల ఇళ్ల నిర్మాణం ఈ 58 నెలల కాలంలోనే జరిగింది. నా కేబినెట్‌లో 68శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారు.58 నెలల్లోనే 2 లక్షల 31 వేల ఉద్యోగాలిచ్చాం. 200 స్థానాల్లో 100 టికెట్లు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకే ఇచ్చా. పేదల భవిష్యత్తు మరో రెండడుగులు ముందుకు వేసేలా 2024 మేనిఫెస్టో ఉందని జగన్ వివరించారు.



# బెయిల్‌మీదున్న జగన్..బాబును జైల్లో పెట్టడా



### ఐదేళ్లుగా బెయిల్ మీద ఉంటూ అధికారం చలాయింపు
### మద్య నిషేధం పేరున పేదల రక్తం పీల్చిన జగన్
### పిఠాపురం రోడ్‌షోలో పవన్ కళ్యాణ్ విమర్శలు

పిఠాపురం,ఏప్రిల్29: ఏపిలో వచ్చేది కూటమి ప్రభుత్వమేనని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. చంద్రబాబును జైల్లో పెట్టినోడు ఎవడు..? ఐదు సంవత్సరాలుగా బెయిల్ మీదున్న వ్యక్తి..! ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఐదేళ్లుగా బెయిల్ మీదున్నాడు. అతడిపై 30 కేసులున్నాయి. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి ఏరులై పారిస్తున్నాడు. రూ.60 ఉండే క్వార్టర్ ఇప్పుడు రూ.200 పలుకుతోంది. రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ జనం ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాడు. అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని మార్చేస్తాం. వచ్చేది కూటమి ప్రభుత్వమే' అని పవన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌పై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విమర్శలు గుప్పించారు. పిఠాపురం మండలంలో పవన్ రోడ్ షో నిర్వహించారు. చెందుర్తి జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షోకు విశేష స్పందన లభించింది. జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో రోడ్ షో పోటెత్తిపోయింది. ఈ రోడ్ షోలో పవన్‌తోపాటు పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా పాల్గొన్నారు. రోడ్ షోలో పవన్ మాట్లాడుతూ.. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు టీడీపీ శ్రేణుల వేదన ఏంటో తనకు అర్థమైందని అన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు వారి బాధను నేరుగా తనతో పంచుకోక పోయినా వారి మనసులో బాధను అర్థం చేసుకుని, నేరుగా రాజమండ్రి జైలుకు వెళ్లి చంద్రబాబుకు మద్దతు తెలిపానని చెప్పారు. అందరూ భయపడుతున్న రోజుల్లో తాను వెళ్లి చంద్రబాబును కలిశానని గుర్తుచేశారు.పవన్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లో.. 'నాలుగు దశాబ్దాల పాటు పార్టీని నడిపిన వ్యక్తి. వర్మ గారి లాంటి బలమైన నాయకులు ఉన్న పార్టీ. నాలుగు దశాబ్దాలుగా బలమైన కార్యకర్తలు, తెలుగు మహిళలు ఉన్న పార్టీ. రాష్ట్రానికి సేవలు చేసిన పార్టీ టీడీపీయే. ప్రతి పార్టీ పాలనలో తప్పొప్పులు, విభేదాలు ఉంటాయి. అవన్నీ ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించుకోవాలి. కానీ చంద్రబాబు లాంటి నాయకుడిని తీసుకెళ్లి 53 రోజులు జైల్లో కూర్చోబెట్టారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'అడగనిదే అమ్మయినా పెట్టదంటారు. అందుకే టీడీపీ కార్యకర్తలను, జనసేన మద్దతుదారులను, బీజేపీ శ్రేణులను అడుగుతున్నా. నేను పిఠాపురం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. నాకు మీ విలువైన ఓటును గాజు గ్లాసు గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించండి. పిఠాపురంలో వర్మ గారి సహకారం మరువలేనిది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా ఇద్దరం కలిసి పరిష్కరిస్తాం. క్షత్రియ కోటాలో వర్మ గారికి ఎమ్మెల్సీ ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఆ దిశగా నేను కూడా కృషి చేస్తా' అని పవన్ కళ్యాణ్ చెప్పారు.

# మోడీని అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్‌న తిరస్కృతి



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీని ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన వినతిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఉత్తర్ ప్రదేశ్ లోని పిలిభిత్ లో ఇటీవల ఇచ్చిన ప్రసంగంలో దేవుడు, మందిరం పేరిట ఆయన ఓట్లు కోరి, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనపై అనర్హత వేటేయాలని వినతిలో పేర్కొన్నారు. అర్జీదారుడి విషయాన్ని ఎన్నికల సంఘం చూడాల్సి ఉండగా ఆయన కోర్టును ఆశ్రయించడం పూర్తిగా దురుద్దేశంతో కూడిందని కోర్టు అభిప్రాయపడింది. న్యాయమూర్తి సచిన్ దత్తా ఆయన వినతిని కొట్టివేశారు. ఇటీవల రాజస్థాన్ లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ముస్లింలను 'చొరబాటుదారులు' అనడానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. "తల్లులు, సోదరీమణుల బంగారం లెక్కలేసి, సంపద సమాచారాన్ని సేకరించి, దానిని పున:పంపిణీ చేస్తానని కాంగ్రెస్ మేనిఫెస్టో పేర్కొంది. వారు ఎవరికి పున:పంపిణీ చేస్తారు? ఇదివరలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దేశ సంపదపై ముస్లింలదే ప్రధాన హక్కు అని అన్నారు" అని మోడీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. 'మీ కష్టార్జితం చొరబాటుదారులకు పోవాలా? దానిని మీరు ఆమోదిస్తారా?' అని కూడా మోడీ ప్రసంగంలో ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల సంఘం బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు నోటీసులు జారీ చేసింది. స్టార్ ప్రచారకులు తమ ప్రసంగంలో సంయమనం పాటించాలని పేర్కొంది.

## గ్లాస్ గుర్తుపై మరో ట్విస్ట్.. టీడీపీ రెబల్ అభ్యర్థులకు కేటాయింపుపై ఈసీ క్లారిటీ..

ఏపీలో గాజు గ్లాస్ కోసం జరుగుతున్న ఫైట్‌లో కొత్త ట్విస్ట్ నెలకొంది. విజయనగరం టీడీపీ రెబల్ మీసాల గీతకు గ్లాస్ సింబల్ కేటాయించింది ఈసీ. ఏపీలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి.నిన్న మొన్నటి వరకు టికెట్ల సర్దుబాటులో తలమునకలైన పార్టీ అధ్యక్షులు తాజాగా ప్రచారంలో జోరు పెంచారు. అయితే పోలింగ్ కు సమయం దగ్గర పడుతుండటంతో నామినేషన్ వేసి మేనిఫెస్టోలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే వైసీపీ మేనిఫెస్టో ప్రకటించిన ప్రచారంలో దూకుడు పెంచింది. ఈ నేపథ్యంలో కూటమి నేతలకు ఎన్నికల గుర్తు తలనొప్పిగా మారింది. ఆదివారం జనసేనకు గ్లాసు గుర్తును కామన్ సింబల్?గా కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఇదే క్రమంలో జనసేనకు గాజు గుర్తును కేటాయించగా స్వతంత్ర్య అభ్యర్థులకు ఎలా కేటాయిస్తారంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.దీనిపై స్పందించింది ఈసీ. తాము నిబంధనల ప్రకారమే కేటాయించామంటున్నారు ఎన్నికల అధికారులు. నిన్నటి వరకు గాజు గ్లాస్ గుర్తు ఫ్రీ సింబల్ లిస్ట్‌లో ఉన్నందున కేటాయించినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో భాగంగా జనసేన మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 21 స్థానాల్లోనే పోటీ చేస్తోంది. అందుకే జనసేన పోటీ చెయ్యని స్థానాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులకు గాజు గ్లాస్ గుర్తును అందుబాటులో ఉంచారు ఎన్నికల అధికారులు. ఏ పార్టీలకు సంబంధంలేని స్వతంత్ర అభ్యర్థులు గ్లాస్ గుర్తు కోరితే కేటాయిచనున్నారు. ప్రస్తుతం టీడీపీ రెబల్?గా పోటీ చేసిన మీసాల గీత ఆప్షన్ మేరకు గ్లాస్ గుర్తును ఇచ్చినట్లు స్పష్టం చేశారు ఎన్నికల అధికారులు. అయితే దీనిపై కూటమి నేతల్లో గందరగోళం నెలకొంది.

# పుట్టినరోజు వేడుకలకు యానం వెళ్లి ఫుల్లుగా తాగారు..

### కట్ చేస్తే, నాలుగు ప్రాణాలు..

ఫ్రెండ్ పుట్టినరోజు వేడుకలు.. ఇంక తగ్గేదేలే.. జోరుగా హుషారుగా ఎంజాయ్ చేద్దామనుకున్నారు.. దానికి యానంను ఎంచుకున్నారు.. మంచిగా యానం వెళ్లారు.. ఫుల్లుగా పీకల దాకా తాగారు..అందరూ మద్యం మత్తులోనే అక్కడినుంచి రాత్రి వేళ ఆటోలో ఇళ్లకు పయనమయ్యారు.. ఈ క్రమంలోనే ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది.. దీంతో నలుగురు యువకులు దుర్మరణం చెందారు.. ఈ ఘోర రోడ్డు ప్రమాదం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోని భట్నవల్లీలో జరిగింది. యానంలో బర్త్ డే పార్టీ ముగించుకొని ఆటోలో తిరిగి వస్తున్న నలుగురు యువకులు దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. వేగంగా వస్తున్న ఆటో లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.అర్ధరాత్రి వరకు యానాంలో ఫుల్లుగా మద్యం తాగి ఆటోలో తిరిగి వస్తుండగా.. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో అమలాపురం మండలం భట్నవిల్లిలో దగ్గర ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.



ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలతో కిమ్స్ లో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.. క్షతగాత్రులను స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.మృతులను నవీన్ (22), జతిన్ (26), నల్లి నవీన్ (27), అజయ్ (18)గా గుర్తించారు. మృతుల్లో ముగ్గురు మామిడికుదురు మండలం నగరం గ్రామస్థులుగా, మరొకరు పీ.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన యువకుడిగా గుర్తించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు.

# రాయ్‌బరేలి కోసం కాంగ్రెస్ వ్యూహాలు

### 24మందితో స్పెషల్ టీమ్ ఏర్పాటు
### ప్రియాంకను రంగంలోకి దింపేందుకు రంగం సిద్ధం

లక్నో,ఏప్రిల్29: ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి లోక్‌సభ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను రాయబరేలి నుంచి తొలిసారి ఎన్నికల బరిలోకి దింపేందుకు ముందస్తుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఎలక్షన్ మేనేజిమెంట్ కోసం 'స్పెషల్ 24' టీమ్‌ను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, 24 మంది మంది సభ్యుల ఈ కమిటీలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పార్టీ ప్రతినిధులు ఉంటారు. ఇందులో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులకు చోటు కల్పించారు. అదనంగా ఐదుగురు కాంగ్రెస్ ప్రముఖులతో ఒక బ్యాకప్ టీమ్ కూడా ఉంటుంది. రాయబరేలిలో ఎన్నికల అంచనాల కోసం ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలుతో పాటు, ఐటీ వార్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. రాయబరేలి ఎన్నికల కోసం సోనియాగాంధీ ఏర్పాటు చేసిన 'స్పెషల్-24' సమన్వయ కమిటీలో ఆమెతో పాటు ఆమె ప్రతినిధులుగా కె.ఎల్.శర్మ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంకజ్ తివారీ, కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు ధీరజ్ శ్రీవాస్తవ, రాయబేరిలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సుశీల్ పసి, హర్జాండ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సురేంద్ర విక్రమ్ సింగ్, సదర్ సీటు మాజీ అభ్యర్థి డాక్టర్ మనీష్ సింగ్ చౌహాన్, సెరెనె అసెంబ్లీ అభ్యర్థి సుధా ద్వివేది, ఊంచహార్ అభ్యర్థి అతుల్ సింగ్, రాయబరేలి నగర్ పాలిక చైర్మన్ శత్రోహన్ సోంకర్, లాల్ గంజ్ నగర్ పంచాయతీ చైర్మన్ సరితా గుప్తా, మాజీ నగర పాలిక చైర్మన్ ఎం.ఇలియాస్, ఏఐసీసీ మాజీ సభ్యుడు కల్యాణ్ సింగ్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేత వీకే శుక్లా ఉన్నారు. కాగా, పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి అవినాష్ పాండే, ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి ఆరాధనా మిశ్రాలు ఎన్నికల ప్రధాన వ్యూహకర్తలుగా వ్యవహరిస్తారు.

# సంపాదకీయం

మంగళవారం 30-04-2024

## యువభారత్... వృద్ధ పాలకులు

భారత జనాభా 140 కోట్లకు చేరింది. ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా గుర్తింపు పొందింది. ఇక ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కూడా మనదే. ఇక జనాభా అత్యధికంగా ఉన్న యువ భారత్‌కు కొదువలేదు. మొత్తం జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. సగటు వయసు 29 కన్నా తక్కువగా ఉంది. అందుకే భారత్‌ను యువ దేశం అని పిలుస్తారు. దేశం యువతది.. కానీ పాలకులు మాత్రం వృద్ధులు. 20 ఏళ్లుగా ఎన్నికైన ఎంపీల వయసు పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.స్వతంత్ర భారత దేశంలో ఇప్పటి వరు 17 లోక్‌సభలు పూర్తయ్యాయి. అంటే 17సార్లు లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1999లో 13వ లోక్‌సభ నుంచి 2019లో జరిగిన 19వ లోక్‌సభ వరకూ ఎంపికైన ఎంపీల సగటు వయసు 50 ఏళ్లు దాటింది. 2014, 2019 ఎన్నికల్లో ఎంపీలు అయిన వారిలో సగటు వయసు ఏకంగా 55 ఏళ్లు దాటింది.భారత దేశంలో ఎంపీగా పోటీ చేయడానికి అర్హత వయసును రాజ్యాంగం 25 ఏళ్లుగా నిర్ధారించింది. అయినా ఎన్నిక అవుతున్న వారు మాత్రం 50 ఏళ్లుదాటిన వారే కావడం గమనార్హం. వయసు మళ్లినవారు ఎక్కువవుతున్న కొద్దీ.. యువ ఎంపీల ప్రాధాన్యం తగ్గుతోంది. 17వ లోక్‌సభకు ఎన్నికైన అత్యంత పెద్ద వయస్కుడైన ఎంపీ షఫీకర్ రెహ్మాన్ బార్క్. ఈయన ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఇక ఈ లోక్‌సభలో అత్యంత పిన్న వయస్కురాలు అయిన ఎంపీ చంద్రాని ముర్మ. ఒడిశాలోని కియోంజార్ స్థానం నుంచి గెలిచారు.2011 జనాభా లెక్కల ప్రకారం.. భారతీయ జనాభాలో 11 శాతం మంది 25?30 ఏళ్ల మధ్యవారే. 2019 లోక్‌సభలో ఈ వయసు వారు కేవలం 1.5 శాతం మంది కూడా లేదు. ఇక 2011 జనాభా లెక్కల ప్రకారం.. 25 శాతం కంటే ఎక్కువ మంది 25?40 మధ్య వయసు వారే ఉన్నారు. అయితే ఈ వయసు వారు 17వ లోక్‌సభలో కేవలం 12 శాతం మాత్రమే ఉన్నారు.ఇక ప్రస్తుతం 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. మరి ఈసారైనా యువతకు అంటే 25?40 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి ఎక్కువ ప్రాధాన్యం దక్కుతుందో లేదో చూడాలి. మరో వైపు పంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత దేశం. ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయంటే.. ప్రపంచమంతా మనవైపే చూస్తుంది. ప్రస్తుతం 18వ లోక్‌సభ కోసం సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తోంది. ఈసీఈసారి ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములయ్యేందుకు ప్రవాస భారతీయులు ఉత్సాహం చూపుతున్నారు. ముఖ్యంగా కేరళ నుంచి విదేశాలకు వెళ్లినవారిలో.. వేల మంది స్వదేశీ బాట పట్టారు. ఇందుకోసం ప్రత్యేక విమానాలను ఆశ్రయిస్తున్నారుఇక కేరళ రాష్ట్రంలో ఎన్నారై ఓటర్లుగా 89,839 మంది నమోదు చేసుకున్నారు. కోజికోడ్‌లో(సుమారు 36 వేలు), మళప్పురంలో(15 వేలు), కన్నూర్‌లో (13 వేలు)తోపాటు పళక్కడ్, వయనాడ్, వడకర ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్నారు. వీరిని పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేందుకు రాజకీయ పార్టీలు విదేశాల్లోనూ ప్రచారం చేశాయి. స్వదేశానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశాయి.ఇక మాతృ దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించేందుకు కేరళ వాసులు స్వరాష్ట్రానికి వస్తున్నారు. కేరళలో అక్షరాస్యత శాతం కూడా ఎక్కువ. అందుకే ప్రజాస్వామ్యంపై గౌరవం కూడా ఎక్కువే. అందుకే ప్రనజాస్వామ్య పరిరక్షణకు మేమే సైతం అంటూ ఖర్చుకు వెనుకాడకుండా స్వదేశానికి తరలి వస్తున్నట్లు రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారుఎందుకంటే.. అన్ని పార్టీల్లో సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో యువ నేతలకు టిక్కెట్లు రావడం లేదు. ఫలితంగా ప్రజలు కూడా పార్టీల ప్రాతిపధికన నేతలను ఎన్నుకుంటున్నారు. మరి ఈసారైనా యువత ప్రాతినిధ్యం పెరగాలని కోరుకుందాం.

# మ్యానిఫెస్టో వార్...

విజయవాడ, ఏప్రిల్ 29 ఏపీలో పోలింగ్ కు రెండు వారాల వ్యవధి మాత్రమే ఉంది. అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈరోజు ఏపీ సీఎం జగన్ వైసీపీ మేనిఫెస్టోను విడుదల చేశారు. దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది. అద్భుతమని వైసిపి శ్రేణులు చెబుతుండగా.. విపక్షాలు మాత్రం బాగాలేదని చెబుతున్నాయి. అయితే తటస్థులు, ఏ పార్టీకి చెందినవారిలో మాత్రం బలమైన చర్చ నడుస్తోంది. అయితే ఊహించినంత స్థితిలో జగన్ మేనిఫెస్టో లేకపోవడం మైనస్ గా మారింది. ఇంతకుముందే టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించింది. దీంతో తాజాగా జగన్ ప్రకటించిన మేనిఫెస్టోతో.. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను బేరీజు వేసుకొని.. ఏది మంచిదా? ఏది మంచిది కాదా? అని చర్చించుకుంటున్నారు.ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే ఉచిత పథకాలు అమలు చేయాలన్నది వైసిపి అభిమతం. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం చేసిన పని ఇదే. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైసీపీ సక్సెస్ అయ్యింది. అదే సమయంలో అభివృద్ధి చేయలేదన్న అపవాదును కూడా మూటగట్టుకుంది. ఇటువంటి సమయంలో వైసీపీ మేనిఫెస్టో ను భారీగా ఊహించుకున్నారు ఏపీ ప్రజలు. కానీ ఇప్పుడున్న పథకాలను కొనసాగిస్తామని.. వాటికి కొద్దిపాటి మొత్తాలను పెంచి జగన్ మేనిఫెస్టోను ప్రకటించారు. అమ్మ ఒడి, రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు రుణాలు వంటి వాటి విషయంలో ఇప్పుడు ఇస్తున్న మొత్తానికి.. కొద్దిపాటి నిధులను పెంచి అమలు చేస్తామని జగన్ ప్రకటించారు. కేవలం రెండు పేజీల్లో.. 9 అంశాలను పరిగణలోకి తీసుకుని మేనిఫెస్టోను రూపొందించారు. అయితే ప్రజలకు భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో.. ఈ మేనిఫెస్టోలో భారీ ఊరట దక్కలేదు. భారీ కేటాయింపులు ప్రకటించలేదు. ఒక విధంగా చెప్పాలంటే వైసీపీ శ్రేణులకే ఈ మ్యానిఫెస్టో అంతగా నచ్చలేదని తెలుస్తోంది. అయితే ఈ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలను భారీ స్థాయిలో ప్రకటించి ఉంటే.. జగన్ పాలనలో అభివృద్ధికి చోటు లేదన్న విపక్షాల విమర్శలకు మరింత ఊతం ఇచ్చినట్లు అవుతుంది. అందుకే జగన్ వెనుకడుగు వేసినట్లు సమాచారం.అయితే ఇప్పటికే టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించింది. ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కానీ ఆశించిన స్థాయిలో మైలేజ్ రావడం లేదు. అయితే తాజాగా వైసిపి మేనిఫెస్టో ప్రకటనతో.. టిడిపి సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లే అవకాశాలు ఉన్నాయి. చంద్రబాబు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. పేద, సామాన్య వర్గాలకు ఇది ఊరట కలిగించే విషయం. మరోవైపు చదువు ప్రోత్సాహకానికి 20వేల రూపాయల చొప్పున సాయం అందిస్తానని ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. అటు సాగు భరోసా కింద రైతుకు 20వేల నగదు అందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే వీటికి మించి జగన్ మేనిఫెస్టో ప్రకటిస్తారని అంతా భావించారు. కానీ గత మేనిఫెస్టోకే కొద్దిగా మెరుగులు దిద్ది ప్రకటించడంతో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు హైలెట్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు కేవలం సూపర్ సిక్స్ పథకాలను మాత్రమే టిడిపి ప్రకటించింది. ఇప్పుడు టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటించే ఛాన్స్ ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భాగస్వామ్య పార్టీగా ఉండడంతో.. కేంద్ర పథకాలు కలిపి.. సంక్షేమ పథకాలకు భారీ కేటాయింపులు జరిపి ప్రకటించే ఛాన్స్ ఉంది. అదే జరిగితే టిడిపి మేనిఫెస్టో కే ప్రజల మొగ్గు చూపే ఛాన్స్ ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏపీని లైట్ గా తీసుకున్న బీజేపీ

విజయవాడ, ఏప్రిల్ 29,ఏపీని బిజెపి లైట్ తీసుకుంటోందా? అందుకే కూటమిని పట్టించుకోవడం లేదా? బిజెపి అగ్ర నేతలు ప్రచారానికి రాకపోవడానికి అదే కారణమా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. మూడు పార్టీలు కూటమి కట్టిన తర్వాత ప్రధాని మోదీ చిలకలూరిపేట సభకు హాజరయ్యారు. చంద్రబాబు, పవన్ లతో వేదిక పంచుకున్నారు. అయితే నెల రోజులు గడుస్తున్నా? ప్రధాని మోదీ ఏపీ వైపు చూడకపోవడం కొద్దిపాటి అనుమానాలకు తావిస్తోంది.ఆరు నెలల కిందట తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన చేశారు. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి? అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై రకరకాల విశ్లేషణలు ప్రారంభమయ్యాయి.గత ఎన్నికలకు ముందు చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. ప్రధాని మోదీని విభేదించారు. ఆ ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసి మూల్యం చెల్లించుకున్నారు. తాను ఏ తప్పు చేశానో గుర్తించుకున్నారు. అందుకే మరోసారి ఎన్డీఏలోకి వెళ్లాలని డిసైడ్ అయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. చివరకు ఎన్నికల ముంగిట బిజెపి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్డీఏలో చేరికకు మార్గం సుగమం అయ్యింది. బిజెపితో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినా ప్రచారం విషయంలో మాత్రం.. బిజెపి అగ్రనేతల నుంచి అనుకున్నంత స్థాయిలో సాయం దక్కడం లేదు. ఇంతవరకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఏపీలో పర్యటన షెడ్యూల్ ఖరారు కాలేదు. కానీ ఇదే సమయంలో తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి మాత్రం బిజెపి అగ్ర నేతలు క్యూ కడుతుండడం విశేషం.తెలంగాణలో బిజెపి ఒంటరి పోరాటం చేసింది. జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. ప్రధాన పార్టీగా బిజెపి ఉండేది. అందుకే బిజెపి అగ్రనేతలు సైతం తెలంగాణ ఎన్నికల విషయంలో ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ప్రధాని మోదీ వరుస ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. అయితే అక్కడ గెలిస్తే బిజెపి అధికారం చేపట్టడానికి అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తరువాత ఆ జాబితాలో తెలంగాణ చేరుతుంది. అందుకే అక్కడ ఎలాగైనా అధికారంలోకి రావాలని బిజెపి అగ్రనేతలు భావించారు. వ్యూహంలో భాగంగానే అక్కడ వరుస పర్యటనలు చేశారు.తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో విభిన్న పరిస్థితి ఉంది.

ఇక్కడ పొత్తులతో ముందుకెళ్తోంది. పొత్తులో సింహభాగం ప్రయోజనాలు ప్రధాన పార్టీ అయిన టిడిపికి దక్కుతాయి. అందుకే బిజెపి అగ్ర నేతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకు తామెందుకు ప్రయత్నించాలన్నది బిజెపి అగ్ర నేతల వాదనగా తెలుస్తోంది. ఏప్రిల్ 30 తో పాటు మే 3,4 తేదీల్లో ప్రధాని తెలంగాణలో పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏపీ విషయంలో మాత్రం ఎంతవరకు స్పష్టత లేదు. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు బిజెపి ఒంటరి పోరు చేస్తుండగా.. పొత్తులో భాగంగా ఏపీలో ఆరు పార్లమెంట్ స్థానాల నుంచి బిజెపి పోటీ చేస్తోంది. అందుకే ఏపీ కంటే తెలంగాణకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే బిజెపి అగ్ర నేతలు ప్రచారానికి రాకపోవడం ఏపీలో కూటమి పార్టీలకు కాస్త ఇబ్బందికరమే

# షర్మిళ దూకుడెందుకు...

కడప, ఏప్రిల్ 29 సోదరి షర్మిలను జగన్ లైట్ తీసుకున్నారు.ఏం చేస్తుందిలే అని భావించారు. తన ముందు ఆమె ఎంత అని తేలిగ్గా తీసుకున్నారు. కానీ ఆమె ఒక పట్టాన విడిచి పెట్టడం లేదు. ముఖ్యంగా బాబాయ్ వివేకానంద రెడ్డి హత్యపై గట్టిగానే మాట్లాడుతున్నారు. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఆమె ద్వారా గట్టిగానే డ్యామేజ్ కలుగుతోంది. అందుకే ఆమెను కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు ఆమె వివేకా హత్య గురించి ప్రస్తావించకుండా చేయాలని కోర్టును ఆశ్రయించారు. అయినా సరే ఆమె వెనక్కి తగ్గడం లేదు. దీంతో ఆమెను ఎలా కంట్రోల్ చేయాలో జగన్కు



తెలియడం లేదు. ఈ అయోమయ స్థితిలో ఏవేవో మాటలు చెబుతున్నారు. మొన్నటికి మొన్న సోదరి పసుపు చీర ధరించడం పై కూడా వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగకుండా ఇప్పుడు షర్మిల పర్యటనకు పోలీసుల నుంచి సహాయ నిరాకరణ ఎదురయ్యేలా ఆదేశాలు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.పులివెందులలో జగన్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సోదరి షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రత్యర్థులకు ఆమె చేతులు కలిపారని కూడా ఆరోపించారు. దీనిపై షర్మిల కూడా స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు. అయితే అలా స్పందించిన మరుసటి రోజు ఆమెకు పోలీసుల నుంచి సహాయ నిరాకరణ ఎదురయ్యింది. దెందులూరు లో షర్మిల సభ అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేయడంలో పోలీసులు చేతులెత్తేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే షర్మిల కాన్వాయ్ గంటకు పైగా ట్రాఫిక్ లో చిక్కుకుంది. ఇలా సభ ముగిసిందో లేదో పోలీసులు అక్కడ నుంచి జారుకున్నారు. కనీసం ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు కూడా ప్రయత్నం చేయలేదు. దీంతో షర్మిల ఎస్పీకి ఫోన్ చేసినా స్పందించలేదు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులే ట్రాఫిక్ ను క్లియర్ చేసుకోవాల్సి వచ్చింది.తనకు ఎదురవుతున్న పరిణామాలతో షర్మిల కూడా వైసీపీ సర్కార్పై విమర్శల జడివాన కురిపిస్తున్నారు. జగన్ పై సైతం అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారసుడు కాదని.. ప్రధాని మోదీ వారసుడంటూ చేసిన వ్యాఖ్యలు ఎక్కువ వైరల్ అవుతున్నాయి. ప్రత్యర్థులు పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. షర్మిల ఈ తరహా వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళ్తుండడంతో జగన్ సైతం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. అందుకే షర్మిల విషయంలో ఎటువంటి రాజీవద్దని.. ఆమె తమ కుటుంబ సభ్యురాలు అని మినహాయింపు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే ఇప్పుడు పోలీసు తో పాటు ఇతర వ్యవస్థలు సహాయ నిరాకరణ చేస్తున్నాయని తెలుస్తోంది. ప్రచారపర్వం తుది అంకానికి వచ్చిన తరుణంలో.. షర్మిల అంటేనే జగన్ భయపడిపోతున్నట్లు సమాచారం. అయితే షర్మిల సభలకు ఆంక్షలు, సహాయ నిరాకరణ మొదటికే చేటు తెస్తాయని.. వైసిపి మెడకు చుట్టుకోవడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కేసీఆర్ ఖచ్చితంగా జైలుకు పోతాడు

మునుగోడు,మద్యం కుంభకోణంలో కవిత జైలుకెళ్ళిందని రానున్న రోజుల్లో కాళేశ్వరం అవినీతి పై ధరణి కుంభకోణం పై కేసీఆర్ కేటీఆర్ కచ్చితంగా జైల్లోకి వెళ్తారని, కెసిఆర్ అనాలోచనల వల్లనే ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రం గా మిగిల్చారు అని ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి అన్నారు మునుగోడు నియోజకవర్గం లో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ముఖ్యనేతల భారీ చేరికలు, చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు ఆరుగురు

నారాయణపురం మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బిఆర్ఎస్ ముఖ్య నేతలు,సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో కి చేరికలు జరిగాయిఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేశారు.. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మరియు సాధారణ ఎన్నికల్లో కూడా ఫోన్ ట్యాపింగ్ చేశారు దీనికి బాధ్యులైన వారు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారు... ప్రజల్లో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంది నాలుగు నెలల క్రితం రాష్ట్రంలో ఎలాగైతే అధికారం ఇచ్చారు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కచ్చితంగా 14 ఎంపీ సీట్లు గెల్చుకొని తీరుతామని భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు

# కడపలో టఫ్ ఫైట్...

కడప, ఏప్రిల్ 29 : కడపలో వైసీపీ పరిస్థితి ఏంటి? గత రెండు ఎన్నికల మాదిరిగా స్వీప్ చేస్తుందా? ప్రస్తుతం ఆ పరిస్థితి ఉందా?ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అపజయం నాటి నుంచి.. కడప జిల్లా చర్చనీయాంశంగా మారింది. షర్మిల కాంగ్రెస్ లోకి ఎంట్రీ, వివేకానంద రెడ్డి హత్య అంశం, టిడిపి, జనసేన, బిజెపి కూటమి కట్టడం తదితర కారణాలతో వైసిపి వెనుకబడిందన్న విశ్లేషణలు ఉన్నాయి. అనూహ్యంగా కడప జిల్లాలో టిడిపి పుంజుకుందన్న సంకేతాలు వస్తున్నాయి. గత రెండు ఎన్నికల కంటే.. ఈసారి టిడిపి శ్రేణులు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.ముస్లిం, క్రిస్టియన్లలో ఘనమైన మార్పు కనిపిస్తోంది. కాంగ్రెస్ వైపు ఆ రెండు వర్గాలు చూస్తున్నట్లు తెలుస్తోంది. క్రాస్ ఓటింగ్ బెడద ఉంటుందన్న సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి.గత ఐదు సంవత్సరాలుగా పులివెందుల మినహా మిగతా నియోజకవర్గాల్లో అభివృద్ధి పెద్దగా కనిపించలేదు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు. ఇప్పుడు ఇవే కీలకంశాలుగా మారాయి. కడప ప్రజలు బాహటంగానే తమ అభిప్రాయాలను చెబుతున్నారు. కడప, మైదుకూరు, ప్రొద్దుటూరులో టిడిపికి మొగ్గు కనిపిస్తోంది. కమలాపురం జమ్మలమడుగులో హోరాహోరీ ఫైట్ ఉంటుంది. బద్వేలులో వైసీపీకే ఛాన్స్ కనిపిస్తోంది. ఓవరాల్ గా గతం కంటే టిడిపి పుంజుకున్నట్లు స్పష్టమౌతోంది.కడప అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాధవి రెడ్డి, వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే అంజాద్ బాషా పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో అంజాద్ బాషా గెలుపొందుతూ వచ్చారు. ఎన్నికల్లో కడప ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి అఫ్జల్ ఖాన్ అనే ముస్లిం అభ్యర్థి బరిలో దిగారు. షర్మిల కాంగ్రెస్ పగ్గాలు తీసుకోవడం, మైనారిటీ అభ్యర్థి కావడం, వైసీపీ ఓట్లు భారీగా చీల్చే అవకాశం ఉంది. అందుకే ఇక్కడ టిడిపి అభ్యర్థికి ఎడ్జ్ కనిపిస్తోంది.ప్రొద్దుటూరులో టిడిపి వైపు మొగ్గు ఎక్కువగా ఉంది. ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా వరదరాజుల రెడ్డి పోటీ చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బరిలో ఉన్నారు. ఈయనపై అవినీతి,అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. టిడిపి బీసీ నేత హత్యతో.. బీసీ సామాజిక వర్గాలు వైసిపి పై వ్యతిరేకతతో ఉన్నాయి. ఎక్కువమంది ప్రజలు టిడిపి వైపే మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు సైతం తేల్చి చెబుతున్నాయి.

## చీపురుపల్లి సెంటిమెంట్ కొనసాగేనా

విజయనగరం, ఏప్రిల్ 29 ఆ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న సెంటిమెంట్ తెరమీదకు రావడంతో చీపురుపల్లిలో ఎన్నికలు మరింత ఆసక్తిగా మారాయి.సుమారు ఐదు దశాబ్దాలుగా ఒక్కసారి మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే రెండు పార్టీలకు సవాలుగా మారిన ప్రస్తుత ఎన్నికల్లో కూడా అదే సెంటిమెంట్ కొనసాగితే అక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలవబోతున్నారన్న చర్చ జోరుగా సాగుతుంది. ఈ నియోజకవర్గంలో 1972లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి రైతు పైడప్పనాయుడు గెలుపొందగా, ఆ ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1978లో కాంగ్రెస్ (ఐ)నుండి చిగిలిపల్లి శ్యామలరావు పోటీ చేసి గెలుపొందగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.అనంతరం 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1983 నుండి 1999 ఎన్నికల వరకు వరుసగా ఇక్కడ టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, 1989 మినహా వరుసగా టీడీపీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చింది. 1983లో త్రిపుర వెంకటరత్నం, 1985 లో కెంబూరి రామ్మోహనరావు, 1989 లో టంకాల సరస్వతమ్మ, 1994, 1999 లో గద్దె బాబురావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989 మినహా ప్రతి ఎన్నికల్లో కూడా టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చింది.ఆ తర్వాత జరిగిన 2004లో ఇక్కడ కాంగ్రెస్ నుండి బొత్స సత్యనారాయణ పోటీ చేసి గెలుపొందగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి ప్రభుత్వ ఏర్పాటు చేసింది. 2014లో టీడీపీ నుండి కిమిడి మృణాళిని గెలుపొందగా, ఆ ఎన్నికల్లో కూడా టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఆ తర్వాత జరిగిన 2019 ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వగా, ఆ ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.ఇలా వరుసగా దాదాపు ఐదు దశాబ్దాల పాటు ఇక్కడ అభ్యర్థులు ఏ పార్టీ నుండి గెలుపొందితే, ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సెంటిమెంట్ గా వస్తుంది. దీంతో ప్రస్తుతం వైసీపీ నుండి బొత్స సత్యనారాయణ పోటీ చేయగా, టీడీపీ నుండి మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు బరిలో ఉన్నాడు. దీంతో ఇరువురి అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారు? పాత సెంటిమెంట్ ఈ ఎన్నికల్లో కూడా కొనసాగితే అక్కడ గెలిచే అభ్యర్థి ఎవరు? ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది? అనే అంశం ఉత్కంఠగా మారింది.

## సెంటిమెంట్ కు ఫుల్ స్టాప్...

భీమిలి, ఏప్రిల్ 29 : ఏపీలో కీలక నియోజకవర్గాల్లో భీమిలి ఒకటి. ఇక్కడ నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి అవంతి శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. ఈయన కూడా మాజీ మంత్రి కావడంతో.. ఇద్దరి మధ్య గట్టి ఫైట్ ఉంది. వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలవాలని గంటా శ్రీనివాసరావు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావుకు టికెట్ దక్కదని అంతా భావించారు. కానీ చివరి వరకు భగీరథ ప్రయత్నం చేసిన గంటా శ్రీనివాసరావు టికెట్ దక్కించుకోగలిగారు. ఇప్పుడు తప్పకుండా విజయం సాధిస్తానన్న ధీమాతో ఉన్నారు. ఇక్కడ అవంతి శ్రీనివాసరావు పై గెలుపొందేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గంలో.. మరోసారి పోటీ చేయరు గంటా. కానీ ఈసారి ఆ ఆనవాయితీకి బ్రేక్ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసిన భీమిలి నుంచి మరోసారి బరిలో దిగారు. 1999లో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి తరుపున తొలిసారిగా పోటీ చేశారు. ఎంపీగా గెలిచారు. 2004లో చోడవరం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. పిఆర్పి కాంగ్రెస్లో విలీనం కావడంతో మంత్రి పదవి చేపట్టారు. 2014లో టిడిపిలో చేరి భీమిలి నుంచి పోటీ చేసిన శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. చంద్రబాబు క్యాబినెట్లో చోటు దక్కించుకున్నారు. 2019లో విశాఖ నార్త్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు భీమిలి నుంచి మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.అయితే గతం మాదిరిగా భీమిలి నుంచి గెలుపు అంత సునాయాసం కాదు. కానీ ఇక్కడ జనసేనకు బలం ఎక్కువగా ఉంది. అందుకే జనసేన కీలక నాయకులను వైసీపీలో చేర్పించారు. వలస పక్షులను భీమిలి ప్రజలు నమ్మరంటూ అవంతి శ్రీనివాసరావు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే తాను భీమిలి వాడినని.. గతంలో గెలిచి ఎంతో అభివృద్ధి చేసిన విషయాన్ని గంటా శ్రీనివాసరావు గుర్తు చేస్తున్నారు. మరోవైపు వైసీపీలో ఉన్న విభేదాలను గంటా శ్రీనివాసరావు క్యాష్ చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులను టిడిపిలోకి రప్పిస్తున్నారు.

## రసవత్తరం... గుంటూరు రాజకీయం

గుంటూరు, ఏప్రిల్ 29 గుంటూరు పశ్చిమ రాజకీయాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాక రేపుతున్నాయి.కమ్మ సామాజికవర్గ ఓటర్ల పట్టున్న కోట గుంటూరు పశ్చిమ నియోజకవర్గం. ఇదే నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం ఓటర్లు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. తెలుగుదేశం, వైసీపీల నుండి ఇద్దరు బీసీ మహిళలే పోటీ పడుతున్నారు. దీంతో పోరు ఆసక్తికరంగా మారంది. వైసీపీ అభ్యర్ధిగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన విడదల రజినీ బరిలో ఉంటే, టీడీపీ అభ్యర్ధిగా రజక సామాజిక వర్గానికి చెందిన గల్లా మాధవి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళలే కావడంతో పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉంది. అయితే మహిళా అభ్యర్ధులకు చెందిన భర్తలు మాత్రం అగ్రకులాలకు చెందిన వారు కావడం విశేషం.విడదల రజిని భర్త కాపు కులానికి చెందిన వారు. కాగా మాధవి భర్త రామచంద్రరావు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. వీరిద్దరూ కూడా తెర వెనుక రాజకీయాలు నడుపుతున్నారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రచారాలకు మాత్రమే అభ్యర్ధులు పరిమితమైతే భర్తలు మాత్రం తెర వెనుక రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. రజిని భర్త కుమార స్వామి ఇప్పటికే కాపు సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేతలందరిని కలిసి తమకే మద్దతు ఇవ్వాలంటూ అడుగుతున్నారు. ఇక మాధవి భర్త రామచంద్రరావు కూడా అటు కమ్మ సామాజిక వర్గంతో పాటు ఇటు కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని కూడా కలుపుకుని వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు.గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఒక్క కాపు సామాజిక వర్గానికి కూడా టికెట్ ఇవ్వలేదని రాజకీయ పార్టీలపై గుర్రు మీద ఉన్నారు. అయితే కాపుల మద్దతు తమకే ఉంటుందని వైసీపీ భావిస్తుంటే, జనసేనతో జతకట్టడంతో కాపుల ఓట్లు తమకే పడతాయని టీడీపీ అంచనా వేస్తోంది. దీంతో క్షేత్ర స్థాయిలో పోరు కాపు వర్సెస్ కమ్మగా మారిపోయింది. ప్రధాన పార్టీలకు చెందిన నేతలిద్దరూ కూడా కాపు ఓటర్లపైనే ఆశలు పెట్టుకున్నారు. మరొకవైపు గత ఆరు ఎన్నికలను పరిశీలిస్తే, ఏ పార్టీ కూడా హ్యాట్రిక్ సాధించలేకపోయింది. 1994, 1999ల్లో టీడీపీ గెలుపొందితే 2004, 2009ల్లో కాంగ్రెస్, 2014, 2019ల్లో టీడీపీ గెలిచింది. దీంతో వచ్చే ఎన్నికల్లో సెంటిమెంట్ తమకే వర్కవుట్ అవుతుందిన వైసీపీ భావిస్తుంటే, ఈసారి కాపు ఓట్లతో గెలిచి చరిత్ర తిరగరాస్తామని టీడీపీ అంటుంది. గెలుపు ఎవరిదైనా పోరు మాత్రం రంజుగా సాగుతోంది.

## అంగన్వాడీ కార్యకర్తలకు డ్యూటీలు

నెల్లూరు, ఏప్రిల్ 29 రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు విధులను బదలాయించిన ఎన్నికల సంఘం.. తాజాగా మరో నిర్ణయాన్ని తీసుకుంది. రానున్న ఎన్నికల్లో అంగన్వాడీలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను ఎన్నికలకు వినియోగించుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఎన్నికల సంఘం.. అంగన్వాడీ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులను పోలింగ్ విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించింది. వీరిని ఓపీవోలుగా నియమించాలని జిల్లా స్థాయిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. అదే సమయంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని కేటగిరీల వారికి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం 12 డి జారీ గడువును మే ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీకి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల్ కోడ్ అమలు దృష్ట్యా లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చూడాలని కోరింది. పింఛన్ సహా నగదు బదిలీ పథకాలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను మార్చి 30న జారీ చేసినట్టు ఈసీ వెల్లడించింది. ఈ మార్గదర్శకాలను వాస్తవిక దృష్టితో ఆలోచించి అమలు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డికి ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత వాలంటీర్లు పూర్తిగా పింఛన్ల పంపిణీకి దూరమయ్యారు. దీంతో పింఛన్లదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్ ఇవ్వడం లేదు. దీనివల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి రావడం, అది కూడా ఆలస్యం అవుతుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ తరహా ఇబ్బందుల్లేకుండా పింఛన్ల పంపిణీపై దృష్టి సారించాల్సిందిగా ఎన్నికల సంఘం సీఎస్‌ను ఆదేశించింది. చూడాలి మరి సీఎస్ పింఛన్ల పంపిణీకి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటారో.

## ఎన్నికల్లలో తలనొప్పిగా పేర్లు

కాకినాడ, ఏప్రిల్ 29 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఈ ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అందులో భాగంగా ప్రతి చిన్న విషయాన్ని కూడా చాలా సీరియస్‌గా చూస్తున్నాయి. వైసీపీ, ఉమ్మడి కూటమి పార్టీలు ప్రతీ ఓటును అత్యంత కీలకంగా భావిస్తున్నాయి. ఇరు పార్టీలు ఎవరి వ్యూహాల్లో వాళ్లు నిమగ్నమవుతున్నారు. ఇలాంటి సమయంలో రూల్స్‌లో ఉన్న లూప్‌లను పట్టుకొని ప్రత్యర్ధులను చికాకు పెట్టిస్తున్నారు.ప్రత్యర్ధుల పేర్లను పోలిన పేర్లు కలిగిన ఇండిపెండెంట్లపై ఫోకస్ చేస్తున్నాయి. అలాంటి వారిని వెతికి పట్టుకుని వచ్చి నామినేషన్లు వేయించడం అన్ని పార్టీలకు సమస్యగా మారుతోంది. ముఖ్యంగా కూటమి అభ్యర్ధులకు పెద్ద తలనొప్పిగా మారిందంటున్నారు. ఈ వ్యూహంలో వెనుకడుగులో ఉన్న కూటమి మాత్రం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. ఎన్ని కుట్రలు చేసినా తమ విజయాన్ని ఆపలేరంటూ చెప్పుకొస్తోంది. అధికారం కూడా కూటమి ప్రభుత్వానిదే అంటోంది.ప్రత్యర్ధి పేరును పోలిన పేర్లు.. లేదా అదే పేరు ఉంటే ఎంతమందిచేతనైనా ఇండిపెండెంట్లుగానో లేక ఏదైనా పార్టీల నుంచైనా కానో ఏదోలా నామినేషన్లు వేయించ గలిగింది వైసీపీ. కూటమి అభ్యర్ధులు ఖరారు అయిన మరుక్షణం నుంచి ఇదే వ్యూహంలో నిమగ్నమై ఆ పార్టీ... ప్రత్యర్ధి పేరును పోలిన పేరు, లేదా అదే పేరుతో ఉన్న వ్యక్తులను వెతికి మరీ పట్టుకుని వారితో నామినేషన్ వేయించారన్నది కూటమి అభ్యర్ధుల ఆరోపణ. ఇదిలా ఉంటే ఈ తరహా నామినేషన్లు సమర్పించిన అభ్యర్ధులకు డమ్మీ నామినేషన్లు కూడా అదే పేరున పోలినవారు ఉండడం, వారిని ప్రపోజల్ చేసిన వారు వైసీపీకి చెందిన వారు ఉండడం గమనార్హం..అమలాపురం(లో వైసీపీ తరపున పినిపే విశ్వరూప్, ఉమ్మడి కూటమి తరపున అయితాబత్తుల ఆనందరావు అభ్యర్ధులుగా ఉండగా వీరిద్దరు నామినేషన్లు వేశారు. వీరితోపాటు కాంగ్రెస్ తరపున అయితాబత్తుల సుభాషిణి, బీఎస్పీ తరపున పొలమూరి మోహన్, ఇతరులు మరో ఆరుగురు నామినేషన్లు వేశారు. ఇందులో కూటమి అభ్యర్ధి అయితాబత్తుల ఆనందరావు పేరులాగానే మరో అభ్యర్ధి ఉన్నారు. ఆయన పేరు అయితాబత్తుల ఆనందరావు, మండపేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అద్దంకివారిపాలెం వాసి ఈయన స్వతంత్ర అభ్యర్ధిగా బరిలో ఉన్నారు. ఈయనకు మద్దతు దారులుగా సంతకాలు పెట్టినవారంతా మాజీ విశ్వరూప్ అనుచరులే.

## కూటమిని గెలిపించుకోవాలి-బాలకృష్ణ



తిరుపతి,రేణిగుంటలో స్వర్ణాంధ్ర సాకార యాత్ర జరిగింది. ఈ కార్యక్రమానికి జనాలు భారీగా తరలివచ్చారు. హిందూపురం ఎమ్మెల్యే బాల కృష్ణ మాట్లాడుతూ యువత మేల్కొనాలి..కూటమిని గెలిపించుకోవాలి. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూసిన వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ అడుగుజాడలో నడిచిన వ్యక్తి చంద్రబాబు. ప్రజల కోసమే నిరంతరం పనిచేసిన మహోన్నత వ్యక్తి చంద్రబాబు. వైసిపి లాంటి ప్రభుత్వాన్ని తెలుగు ప్రజలు గతంలో ఎప్పుడూ చూడలేదు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించండి. లోటు బడ్జెట్ తో అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను కాపాడుకోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి. ఎపికి ఒక్క పరిశ్రమ గత ఐదేళ్ళలో రాలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంటలో ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చింది చంద్రబాబు. సిద్దం..సిద్ధమని ప్రజలను మరోసారి మోసం చేసేందుకు జగన్ సిద్ధమయ్యాడు. యువతను గంజాయికి బానిస చేశారు. రైతులను నట్టేట ముంచారని అన్నారు.రైతుల ఆత్మహత్యలు దేశంలోనే మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. ఇక నీ ఆటలు సాగవు జగన్. రాబోయే ఎన్నికల్లో నీ నడ్డివిరిచేందుకు జనం సిద్ధంగా ఉన్నారు జగన్. అందరూ ఒక్కటై జగన్ కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. అభివృద్ధి-అరాచకమా, స్వర్ణయుగమా-రాతియుగం కావాలా ప్రజలే ఆలోచించండి. సూపర్ సిక్స్ పథకాలే ప్రజలకు శ్రీరామ రక్ష. ఇచ్చిన మాట ఖచ్చితంగా చంద్రబాబు నెరవేరుస్తారు. జగన్ మేనిఫెస్టో అంతా బూటకమే..రౌడీ రాజ్యం మనకొద్దు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిపై హత్యాయత్నం చేయడం దారుణం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంతా అరాచకమే చేశారు. ప్రజాధనాన్ని దోచేసిన ఘనుడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి. ప్రతి పనిలోను కమిషన్, భూకబ్జాలకు కేరాఫ్ బియ్యపు మధుసూదన్ రెడ్డి. సూళ్ళూరుపేటలో కొకైన్, డ్రగ్స్ అమ్ముతున్నారని అన్నారు.మా అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిపై 16అక్రమ కేసులు పెట్టారు. అక్రమ కేసులకు మా కార్యకర్తలు భయపడలేదు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ఖచ్చితంగా గెలుస్తాడు. ఎవరికీ భయపడొద్దు..ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉండండి. సమసమాజ స్థాపన కోసం నడుంబిగించండి. ఓట్లను అమ్ముకోకండి..నమ్ముకోండని అన్నారు.

## కనిపించని సినీగ్లామర్

విజయవాడ, ఏప్రిల్ 29, సినిమా ఇండస్ట్రీ, ఏపీ రాజకీయం. వీటి రెండింటిని విడదీసి అస్సలు చూడలేం. గతంలో ఏపీ పాలిటిక్స్‌లో సినీ గ్లామర్ అంతలా కనిపించేది మరి. దశాబ్ధాల కాలం నుంచి ఇదే సీన్ కనిపిస్తూ వస్తుంది. కొన్ని రోజుల క్రితం వరకు ఈసారి ఈ ఇంపాక్ట్ తగ్గుతుందన్న టాక్ ఉండేది. కానీ కొన్ని రోజులుగా జరుగుతున్న వరుస సీన్స్ చూస్తుంటే.. ఇది శుద్ధ తప్పుడు అభిప్రాయమని అర్ధమవుతుంది. సినిమా నటుల చేత ఎన్నికల ప్రచారం చేయించేవి పార్టీలు. కానీ రాను రాను.. ఏకంగా సినిమా నటులే బరిలోకి దిగడం మొదలైంది. ఇలా సినిమాల్లో నటించి రాజకీయాల్లోకి వచ్చిన తొలి నేత ఎవరో మీక్ ఐడియా ఉందా? ఆయన పేరు కొంగర జగ్గయ్య.. 1967లో జరిగిన నాలుగో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. ఇక ఆ తర్వాత దాసరి, రావుగోపాల రావు.. కృష్ణ, కృష్ణంరాజు, జమున, కైకాల, మురళీ మోహన్, చిరంజీవి, హరికృష్ణ, రామానాయుడు, మోహన్‌బాబు, శారద, జయప్రద, విజయశాంతి..ఇలా చాలా పెద్ద లిస్ట్ ఉంది. వీరందరిలో ఎన్టీఆర్‌ది మాత్రం సపరేట్ రూట్..ఆయన ఏకంగా పార్టీ పెట్టి ప్రభంజనం సృష్టించారు. అధికారంలోకి వచ్చారు.. ఇక అప్పటి నుంచి ఏపీ పాలిటిక్స్‌లో సినిమా వాళ్ల ఇన్‌వాల్వ్‌మెంట్ మరింత పెరిగింది. ఈ ట్రెండ్ ఇప్పటికీ కూడా కంటిన్యూ అవుతుంది. అయితే ఈసారి ప్రజలపై ఇలాంటి నటుల ఇంపాక్ట్ ఎలా ఉండబోతుంది? అనేది ఇక్కడ బిగ్ క్వశ్చన్..కొన్ని రోజులు ముందు ఏపీ రాజకీయాల్లో సినీ ఇంపాక్ట్ క్రమంగా తగ్గుతోందనే భావన ఉండేది. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఎఫెక్ట్ పెద్దగా పని చేయలేదు. మరి ఈసారి ఏ మేర పనిచేస్తుందన్నది చూడాలి. అయితే గతంలో లాగా ప్రజల ముందుకు వచ్చి మాత్రం ఇండస్ట్రీ పెద్దలు ఎక్కువగా హడావుడి చేయడం లేదు. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తెలియదు. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న టెన్షన్‌తోనే సినీ ప్రముఖులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారా అనే అనుమానాలు ఉన్నాయి. అయితే కొందరు సినీ పరిశ్రమకు చెందిన వారిలో కొందరు టీడీపీ, జనసేన కూటమికి బహిరంగంగానే మద్దతు ఇస్తుంటే. ఇంకొందరు మాత్రం వైసీపీకి సపోర్ట్ గా నిలుస్తున్నారు. ప్రస్తుతం సినీ ఇండస్ట్రీ రెండు పార్టీల వైపు చీలిపోయి కనిపిస్తోంది. అయితే ఆ చీలిక బయటకు కనిపించడం లేదు. బాహా బాహీ అన్నట్లు లేదు. పెద్దగా సినీ ప్రముఖులు ఎవరూ పొలిటికల్ ప్రచారాల్లో కనిపించడం లేదు కూడా.ఇప్పటికే ఎన్డీఏ కూటమికి మెగాస్టార్ చిరంజీవి జై కొట్టారు. తమ్ముడు పవన్ కల్యాణ్‌తో పాటు బీజేపీ నేతలకు మద్దతు ఇస్తున్నట్టు బహిరంగంగానే ప్రకటించారు. చిరు బాటలోనే ఆయన కుటుంబ సభ్యులతో పాటు జబర్దస్త్ టీమ్‌లోని కొందరు నటులు కూడా ఉన్నారు. పవన్‌కు మద్దతుగా వీరంతా ప్రచారాలు, రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రముఖ నిర్మాత దిల్ రాజు మద్దతు ప్రకటించారు. మరో ప్రముఖ నిర్మాత, రచయిత కోన వెంకట్ జగన్ ప్రభుత్వాన్ని భేష్ అంటున్నారు. పోసాని వైసీపీకి అనుకూలంగా దుమ్ము దులుపుతున్నారు. పృథ్వీ జనసేన క్యాంప్‌లో చేరారు. వైసీపీలోనే ఉన్న అలీ ప్రస్తుతం ఆ పార్టీకి దూరంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది.ఇటీవల ప్రచారంలో పవన్ కల్యాణ్.. సూపర్ స్టార్ కృష్ణను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీనిపై చాలా కాంట్రవర్సీ నడిచింది. అయితే దీనిపై ఇండస్ట్రీ నుంచి పెద్దగా రియాక్షన్ రాలేదు. దీనిపై మహేష్‌బాబు కూడా మౌనంగానే ఉన్నారు. కానీ నరేష్ మాత్రం చురకలు అంటించారు. ఇక అక్కినేని నాగార్జున కుటుంబం కూడా మౌనంగానే ఉంది. సో ఓవరాల్‌గా చూస్తే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విషయంలో.. తెలుగు సినిమా పరిశ్రమ చీలికలు పేలికలుగా మారింది. ఎన్నికల విషయంలో ఏకతాటిపై ఉండకున్నా.. న్యూట్రల్‌గా ఉండాల్సిన సినీ పెద్దలు ఎవరి దారిలో వారు ఉన్నారని అర్థమవుతుంది. అయితే తెలంగాణ ఎన్నికల్లో వీరంతా సైలెంట్‌గా ఉన్నారు. కానీ ఏపీ ఎన్నికల విషయానికి వచ్చే సరికి మాత్రం సీన్ మొత్తం మారిపోయింది.ఎన్నికలు వచ్చిన ప్రతిసారి జూనియర్ ఎన్టీఆర్ టాపిక్ రావడం రొటీన్‌గా మారింది. 2009 ఎన్నికల్లో టీడీపీ కోసం చేయాల్సిందంతా చేశారు ఎన్టీఆర్.. బట్ ఆ ఎన్నికల తర్వాత నుంచి రాజకీయాల విషయంలో ఆయన ఆలోచన మారినట్టు కనిపిస్తుంది. ఆయన ఎప్పుడూ పార్టీ కార్యక్రమాల్లో కనిపించలేదు.. ప్రచారానికి కూడా రాలేదు. ఈసారి కూడా ఆయన ప్రచారానికి దూరంగానే ఉన్నారు. కానీ తారక్ ఫ్రెండ్స్‌గా చెప్పుకునే కొడాలి నాని, వల్లభనేని వంశీ అనుచర వర్గాలు మాత్రం తారక్ మద్ధతు తమ నేతలకే ఉందని ప్రచారం చేసుకుంటున్నారు.పవన్ కల్యాణ్ సినిమా నుంచి వచ్చినవారే కావడంతో ఇప్పుడు పెద్దగా ఎఫెక్ట్ కనిపిస్తుంది. దీనికి తోడు టీడీపీ బాలకృష్ణ, నారా రోహిత్‌తో పాటు పలువురు నిర్మాతలు కూడా పార్టీకి అండదండలు అందిస్తున్నారు. ఎట్ ది సేమ్ టైమ్.. రోజా కూడా సినిమాల నుంచి వచ్చినవారే..ఇండస్ట్రీలోని ఓ వర్గం కూడా వైసీపీకి అనుకూలంగా ఉంది. అయితే ఇండస్ట్రీలో కొందరిని మినహాయించి.. చాలా మంది టీడీపీ,జనసేనతో టచ్‌లో ఉన్నారని మాత్రం జోరుగా ప్రచారం జరుగుతుంది.

## తిరుమల లడ్డును గంజాయితో పోలిస్తే..

### పుణ్యక్షేత్రం లో పుట్టగతులుండవు వైసీపీ మహిళల విమర్శ

తిరుమల,ప్రపంచవ్యాప్తంగా అతి పవిత్రంగా కంటికి అద్దుకుని తీసుకునే .. తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డును గంజాయితో పోల్చడం , ఉమ్మడి పార్టీల నాయకులకు తగదని .. వైకాపా మహిళా నేత రుద్రరాజు శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో సోమవారం మీడియా ముందు కార్పొరేటర్ దూదికుమారి కాపునాడు మహిళా అధ్యక్షురాలు గల్లా కవిత , కోశాధికారి ఉష , శైలు , రాధా , కుమారి తదితరులతో కలిసి శ్రీదేవి మాట్లాడుతూ .. మత్తు పదార్థాల వినియోగంపై యువతను మార్చడానికి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి నిర్మానుషమైన , మారుమూల ప్రాంతాలలో , ముళ్ళ పొదల్లో తిరిగి మత్తుకు బానిసలయిన వారిని పోలీసులకు పట్టించి .. వారిలో మార్పు తీసుకొచ్చి , యువత జీవితాలను కాపాడారని కొనియాడారు. అలాగే కరోనా కాలంలో కరోనాతో చనిపోయిన అనాధ శవాలకు సైతం దహన క్రియలు చేయించిన ఘనత భూమనదన్నారు. నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే వాటిపై స్పందించి కరోనా నుంచి కరుణామయుడు లా కరుణాకర్ రెడ్డి కాపాడారన్నారు. కరోనాకాలంలో ఈ మూడు పార్టీలు ఎందుకు ప్రజా సేవ కు ముందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ సేవలతో నాలుగు సార్లు ఎమ్మెల్యే భూమనకు కరోనా వచ్చిందని.. దాన్ని సైతం లెక్కచేయక తిరిగి ప్రజల మధ్య తిరుగుతూ జనాన్ని భూమన అప్రమత్తం చేశారన్నారు. నిజంగా ఉమ్మడి పార్టీలకు యువతను కాపాడాలనుకుంటే .. గంజాయి అమ్మక ప్రదేశాలను , మాకు చూపిస్తే దానిపై అందరం కలసి చర్యలు తీసుకుంటాం , అంతేగాని నోరు ఉంది కదా అని తప్పుడు సమాచారాన్ని మీడియా ముందు వ్యాఖ్యానించడం మంచిది కాదని హెచ్చరించారు. ఓటమి భయం కూటమికి పట్టుకొని.. ఇలా లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. టిడిపి చైర్మన్ దర్శనాలను అమ్ముకుంటున్నారని .. తప్పుడు విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. వైకాపా కార్యకర్తలు వెళ్లి దర్శన లెటర్లు ఇమ్మన్నా కూడా దానిని కరుణన్న తిరస్కరిస్తూ.. ఇతర రాష్ట్రాల నుంచి నడుచుకుంటూ తిరుమలకు వచ్చే భక్తుల తో పోల్చుకుంటే.. అతి తక్కువ సమయంలో వెళ్లి శ్రీవారి దర్శనం చేసుకోవడం మనకు సులువని.. అందరిలాగే మీరు దర్శనం చేసుకోవడం మంచిదని .. భూమన తమకు సర్ది చెప్పడం లోనే .. కరుణాన్న నిజాయితీని చూడవచ్చని కొనియాడారు.

## ప్రజకాంక్ష ప్రభుత్వంకి మద్దతు ఇచ్చి జగన్ ను సీఎం చెయ్యండి

### - ఆత్మీయ సమావేశంలో వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి, పరవాడ మాజీ సర్పంచ్ చుక్కా

### నాయుకులు పార్టీలు మారిన ప్రజా మద్దతు వైకాపా వైపే అన్న చుక్కా

పరవాడ, పరవాడ గ్రామంలో మాజీ సర్పంచ్,వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రాము నాయుడు ఆదివారం తన క్యాంపు ఆఫీస్ స్థలంలో తన అనుచరులు,మద్దతుదారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆత్మీయ సమావేశంలో చుక్కా మాట్లాడుతూ రేపు వచ్చే ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్న రెడ్డి అదీప్ రాజ్ ను,ఎంపీ అభ్యర్థిగా బూడిముత్యాల నాయుడును భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బహుమతికి ఇవ్వాలని దానికి గ్రామంలో అందరూ పార్టీ విజయానికి సహాశక్తుల కృషి చెయ్యాలని అన్నారు.పెందుర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కంటే పరవాడ గ్రామం వైకాపాకు కంచుకోటగా ఉన్న గ్రామం కాబట్టి మంచి మెజార్టీతో ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థికి బహుమతిగా ఇవ్వాలని కోరారు.తన రాజకీయ అనుభవంలో ఎంతో మంది యువలకల్ని నాయుకులుగా తీర్చిదిద్దాని, తన పదవి కాలంలో గ్రామానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేస్తూ అన్ని దిశలాగా అభివృద్ధి చేసుకొంటూ వచ్చానని, అవకాశవాదా రాజకీయాలు చేసే పద్ధతి తన దగ్గర ఉండదని కష్టం అయ్యిన నష్టం అయ్యిన తను నమ్మిన సిద్ధాతం మీదే నిలబడి ఉంటానని గ్రామంలో తన మీద బురదజెల్లే కార్యక్రమాలు ఎన్నీ చేసిన దేనికి బేదేరెదు లేదని ఒకరు పోతే మొరొక్క నాయకుడును తయారుచేసే సత్త తనకి ఉందని అన్నారు. గ్రామంలో ప్రభుత్వం నుంచి ప్రతి ఒక్క ఇంటికి పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందే విధంగా వాలంటరీ వ్యవస్థ ద్వారా ఎంతో కృషి చేసామని ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును ఎవ్వరు మర్చిపోకుండా ప్రతిపక్షాల చిలక పలుకులను నమ్మి మోసపోకుండా ప్రస్తుత వైకాపా ప్రభుత్వంకి మద్దతు తెలపి వైస్సార్సీపీ అభ్యర్థిలను గెలిపించాలని కోరారు.

## హేమంత్ సోరెన్ మధ్యంతర బెయిల్ పిటిషన్..!

### ఈడీకి 'సుప్రీం' నోటీసులు..!



జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఇఅ) స్పందన కోరింది. బెయిల్‌పై జార్ఖండ్ హైకోర్టు తీర్పులో జాప్యం, మనీలాండరింగ్ కేసులో ఆయనను అరెస్టు చేయడాన్ని పిటిషన్‌లో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ధర్మాసనం ఈడీకి నోటీసులు జారీ చేస్తూ మే 6లోగా సమాధానం ఇవ్వాలని కోరింది. ఈ కేసులో సోరెన్ అరెస్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జార్ఖండ్ హైకోర్టు తీర్పును ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.సోరెన్ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అరుణాభ్ చౌదరి వాదనలు వినిపించారు. కేసు విచారణను మళ్లీ మే రెండోవారంలో జిరగే అవకాశం ఉన్నది. ఇంతకు ముందు ఏప్రిల్ 27న రాంచీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో సోరెన్‌కు షాక్ తగిలింది. భూ కుంభకోణం కేసులో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు రాంచీలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. హేమంత్ సోరెన్ తండ్రి, జేఎంఎం అధినేత శిబు సోరెన్ సోదరుడు రామ్ సోరెన్ శనివారం ఉదయం మరణించారు. కొంతకాలంగా ఆయన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు 12 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరారు. అయితే, విచారణ సందర్భంగా ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు కోర్టు నిరాకరించింది.

## కుప్వారాలో కుంభవృష్టి.. వరద గుప్పిట్లో చోగల్ గ్రామం..

జమ్ముకశ్మీర్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ కూడా ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో కుంభవృష్టి కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరదలు పోటెత్తాయి. చోగల్ గ్రామం పూర్తిగా వరద గుప్పిట్లో చిక్కుకుపోయింది. ఆ గ్రామంలోని వీధుల్లో భారీగా వరద నీరు నిలిచిపోయింది.దాంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదు. కొన్ని చోట్ల ఇళ్లలోకి కూడా వరద నీరు చేరింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన స్థానిక అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. చోగల్ గ్రామం నీళ్లలో కూరుకుపోయిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.



## స్థానికులకు మంగళవారం దర్శన అవకాశాన్ని పునరుద్ధరిస్తా.....

### ఆరణి శ్రీనివాసులు

తిరుమల,కొడుకును ఎన్నికల్లో గెలిపించుకునేందుకు తిరుపతి అభివృద్ధి పేరుతో టిటిడి నిధులను ఛైర్మన్ గా కరుణాకర్ రెడ్డి దారిమళ్ళించాడని తెలుగుదేశం...బిజేపి బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. దర్శనాల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు భక్తులను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన భాగ్యం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తిరుమలలోని బాలాజీ నగర్ లో ఇంటింటి ప్రచారాన్ని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నిర్వహించారు. స్థానికులు ఆరణి శ్రీనివాసులకు అడుగడుగునా హారతులు పట్టి ఆయనను ఆశీర్వదించారు. తెలుగుదేశం..జనసేన, బిజేపి నాయకలు వెంట రాగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో తిరుమలను అప్రదిష్టపాలు చేశారని అన్నారు. నిబంధలనకు విరుద్ధంగా టిటిడి నిధులను తిరుపతి అభివృద్ధి పేరుతో ఛైర్మన్ గా ఉన్న కరుణాకర్ రెడ్డి నిధులు మళ్లించారని ఆయన ఆరోపించారు. కమిషన్ డబ్బు...దొంగ ఓట్లతో గెలవాలని కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డీలు చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఐదేళ్ళుగా టిటిడి ఎక్స్ అఫిసియో మెంబర్ గా ...ఛైర్మన్ గా ఉంటూ స్థానికులకు దర్శన భాగ్యం కల్పించడంలో కరుణాకర్ రెడ్డి విఫలమైయ్యారని ఆయన ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కాగానే తిరుపతి, తిరుమలవాసులకు ప్రతి మంగళవారం దర్శనాన్ని పునరుద్ధరిస్తామని ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నర్సింహ యాదవ్, మందలపు మోహన్ రావు, జేబి శ్రీనివాసు, కోడూరు బాలసుబ్రమణ్యం, వూకా విజయ్ కుమార్, శ్రీధర్ వర్మ, కందాటి సురేష్, చినబాబు తిరుమల టిడిపి అధ్యక్షుడు రాజు యాదవ్, సెక్రటరీ శివ షణ్ముగం, రాజు, దేవ,ఆనంద్, ట్యాక్సీ యూనియన్ వైస్ ప్రెస్ డెంట్ బాబు పాల్గొన్నారు.

# ప్రజలు స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్.**



శ్రీ ప్రస్థానం న్యూస్ / కోవెలకుంట్ల ఏప్రిల్ 29 :- ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలో ని పలు స్టేషన్ ల పరిదిలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర మాట్లాడుతూ ఆదివారం మరియు సోమవారం నాడు పోలీసు స్టేషన్ పరిదులలో ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని , జిల్లా ఎస్పీ కె..రఘువీర్ రెడ్డి ఆదేశాలమేరకు సమస్యాత్మక ప్రాంతాలు అయిన సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాల మరియు సంజామల గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు మరియు శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారికి ( ట్రబుల్ మాంగర్స్ కు)కౌన్సిలింగ్ నిర్వహించారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల బరిలో న్యాయవాది..



ఆళ్లగడ్డ, ఏప్రిల్: 29, శ్రీ ప్రస్థానం న్యూస్:- జై భీమ్ రావ్ భారత్ పార్టీ తరఫున ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా న్యాయ వాది ధారా శేఖర్, ఎన్నికల బరిలో పోటీ పడుతున్నారు.. ఈ మేరకు ఆయన ఏప్రిల్ నెల 24 వ తేదీ బుదవారం ఆళ్లగడ్డ పట్టణంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయానికి చేరుకొని అక్కడ రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రెడ్డి,కి నామినేషన్ పత్రాలను సమర్పించారు.. ఈ సంధర్బంగా ఆర్.ఓ. నామినేషన్ పత్రాలను ఆమోదించిచినట్లు ఆయన అన్నారు. జై భీమ్ రావ్ భారత్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా తమకు నియోజకవర్గ ప్రజలందరూ మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు..తనకు ఎమ్మెల్యే గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శ్రావణ్ కుమార్,కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

## ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమం అందాలంటే జగన్ ను సీఎం చేయాలి -బుసినే విరుపాక్షి



హోలహర్వి మండలం ప్రస్థానం న్యూస్ ఏప్రిల్ 29:- హోలహర్వి మండలంలో సోమవారం చాకిబండ, బేవినహాల్, శ్రీధరహాల్ ,కొక్కరచేడు , మేదహాల హోలహర్వి, నిట్రవట్టి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వైయస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి జన సందోహం మధ్య కార్యకర్తల ఆధారాభిమానాల మధ్య ఎంపీ గోరంట్ల మాధవ్, జే సి యస్ కన్వీనర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి , వైకుంఠం మల్లికార్జున చౌదరి, మసాల పద్మజ , శశికళ,నాయకులు కార్యకర్తలు కలిసి జోరుగా సాగిన ప్రచారం ప్రజల విశేష ఆదరణ చూసి భారీ గెలుపు పై ధీమా వ్యక్తం చేసిన నాయకులు ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అయిన వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించి నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజల్ని ఆయన కోరారు. సీఎం జగన్ చేసిన మంచి వల్లే మాకు పల్లె పల్లెనా ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు ప్రజలు పలుకుతున్నారు.నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి అనేది నా ఆశయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి , జనార్దన్ నాయుడు , వైస్ ఎంపీపీ నాగేష్ , అర్ధగేరి తిప్పారెడ్డి ,పచ్చారపల్లి రాఘవేంద్ర రెడ్డి ,మండల యూత్ అధ్యక్షులు గంగాధర్, కో కన్వీనర్ మల్లికార్జున, జెసియస్ కన్వీనర్ రంజిత్ , మాచనూరు సుంకన్న,అంచే గోపాల్ , వన్నూర్ , గోవర్ధన్, వంశీ పచ్చారపల్లి నాగేష్ , సచివాలయ కన్వీనర్లు, రైతు సంఘం అధ్యక్షులు, విద్యా కమిటీ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, గృహ సారథులు,నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కమనీయం రమణీయం శ్రీశ్రీశ్రీ భీమ రాయ స్వామి రథోత్సవం..!

**వైసిపి నాయకులు వై ప్రదీప్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి...!**



శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్ :పెద్ద కడుబూరు మండలం లోని జాలవాడి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ భీమరాయస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం అశేష జన వహినుల మధ్య అత్యంత వైభవంగాను కమనీయం రమనియంగా కన్నుల పండుగ కొనసాగింది ,ముందుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శ్రీశ్రీ భీమరాయస్వామి వారికి ఆలయ అర్చకులు నాగరాజ్ స్వామి జలాభిషేకం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకంలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు, శ్రీ భీమ రాయ స్వామివారి రథాన్ని పుష్పలతో సుందరంగా అలంకరించారు, ఉత్సావమూర్తిని ఆలయంలో నుండి ఊరేగింపుగా రథం వద్దకు తెచ్చారు, అలాగే స్వామివారి పూర్ణ కుంభంతో ఊరేగింపుగా తెచ్చారు, అనంతరం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో శ్రీశ్రీభీమ రాయ స్వామి రథోత్సవం బ్యాండా మేళల తాళాలతోను ఊరేగింపుగా వెళ్లి పుష్పరథన్ని కి నైవేద్యం సమర్పించి అనంతరం శ్రీశ్రీ భీమారాయ స్వామి ప్రతిమను రథంపై ఉంచి రథాన్ని ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుండి బస్టాండ్ ఆవరణంలో మెయిన్ రోడ్డు వద్దకు లాగి మళ్లీ యధా స్థానంలో ఉంచారు రథాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ఆయా గ్రామాల భక్తాదులు, ప్రజలు పాల్గొని శ్రీశ్రీ బీమా రాయ స్వామి వారిని దర్శించుకున్నారు, అయితే భీమరాయ స్వామి రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, ఎస్ ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీరఘురాం, జాలవాడి ఎంపిటిసి వెంకటేష్, భీమారెడ్డి, ఆంజనేయులు, అల్లయ్య , చిన్న భీమ రాయుడు, పోలీస్ ఇబ్బంది, గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు భక్తాదులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# సంక్షేమాభివృద్ధికి పట్టం కడుదాం: బుట్టా ప్రతుల్





గోనెగండ్ల : ఏప్రిల్ 29 )గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహల్లి గ్రామంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక కుమారుడు బుట్టా ప్రతుల్, కోడలు బుట్టా సాహితి లు గడప గడపకు ఎన్నికల ప్రచారంలో బాగంగా ప్రతి ఇంటికి వెళ్లి పార్లమెంట్ అభ్యర్థి బివై. రామయ్య,ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అవినీతి రహిత పాలన అందించారని కుల,మత,రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకి చేరవేస్తామని గుర్తు చేశాను.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఆఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరడం జరిగింది.ఈ ప్రచారంలో గోనెగనీడ్ల మండలం యూత్ నాయకులు బందేనవజ్ , యువ నాయకులు రవి కుమార్ నాయుడు,సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, మండల కన్వీనర్ దొరబాబు,మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్,సర్పంచ్ రాముడు, తిరుమల్ రెడ్డి,మహేశ్వర రెడ్డి, బందేనవాజ్, రఫీక్,మరియు వారి అనుచరులు, వైసీపీ పార్టీ ముఖ్య నేతలు ,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ

**-నేడు ఆయన జయంతి**



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించి, తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పి శ్రీశ్రీగా ఎదిగి, మహాకవిగా గుర్తింపు పొందారు శ్రీరంగం శ్రీనివాసరావు, 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పటకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగం గా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నం లో జరిగింది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించాడు. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ యేట ప్రచురింపబడింది.1931లో మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ పూర్తి చేశాడు.1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎన్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరాడు. 1938 లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తర్వాత ఢిల్లీ ఆకాశవాణిలోను, నిజాం సంస్థానంలోను, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుంచి 1940 వరకు తాను రాసిన 'గర్జించు రష్యా', 'జగన్నాథ రథ చక్రాలు' వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహా ప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించాడు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకం గా శ్రీశ్రీ మహాప్రస్థానం మిగిలిపోయింది. ఈయన ప్రముఖ హాస్యనటుడు రాజబాబుకు తోడల్లుడు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది మరియు నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందాడు. వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించాడు. ఎన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు వీటిలో కొన్ని. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసాడు. 1970లో అతని షష్టిపూర్తి ఉత్సవం విశాఖపట్నంలో జరిగింది. ఆ సందర్భంగానే అతను అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్ 15 న శ్రీశ్రీ మరణించాడు. మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనది... మరో ప్రపంచం,మరో ప్రపంచం,మరో ప్రపంచం పిలిచింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!పోదాం, పోదాం పైపైకి!కదం త్రొక్కుతూ,పదం పాడుతూ,హ్రుదాంతరాళం గర్జిస్తూ-పదండి పోదాం,వినబడలేదామరో ప్రపంచపు జలపాతం?దారిపొడుగునా గుండె నెత్తురులుతర్పణ చేస్తూ పదండి ముందుకు!బాటలు నడచీ,పేటలు కడచీ,కోటలన్నిటిని దాటండి!నదీ నదాలూ,అడవులు, కొండలు,ఎడారులా మన కడ్డంకి?పదండి ముందుకు!పదండి త్రోసుకు!పోదాం, పోదాం, పైపైకి!ఎముకులు క్రుళ్ళిన,వయస్సు మళ్ళినసోమరులారా! చావండి!నెత్తురు మండే,శక్తులు నిండే,సైనికులారా! రారండి!"హరోం! హరోం హర!హర! హర! హర! హర!హరోం హరా!'' అని కదలండి!మరో ప్రపంచం,మహా ప్రపంచంధరిత్రినిండా నిండింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!ప్రభంజనంవలె హోరెత్తండీ!భావ వేగమున ప్రసరించండీ!వర్షుకాభ్రముల ప్రళయఘోషవలెపెళ పెళ పెళ పెళ విరుచుకు పడండి!పదండి,పదండి,పదండి ముందుకు!కనబడలేదా మరో ప్రపంచపుకణకణమండే త్రేతాగ్ని?ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్నవిఎనభై లక్షల మేరువులు!తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్జలప్రళయ నాట్యం చేస్తున్నవి!సలసలక్రాగే చమురా? కాదిది ఉష్ణరక్త కాసారం!శివసముద్రమూ,నయాగరావలె ఉరకండీ! ఉరకండీ ముందుకు!పదండి ముందుకు!పదండి త్రోసుకు!మరో ప్రపంచపు కంచు నగారావిరావ మెరుగక మ్రోగింది!త్రాచులవలెనూ,రేచులవలనూ,ధనంజయునిలా సాగండి!కనబడలేదా మరో ప్రపంచపుఅగ్నికిరీటపు ధగధగలు,ఎర్రబావుటా నిగనిగలు,హోమజ్వాలల భుగభుగలు?

## అమేథి లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన స్మృతి ఇరానీ

ఉత్తరప్రదేశ్‌లోని అమేథి లోక్‌సభ స్థానానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా భావించే అమేథి నుంచి 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఇరానీ గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరుసగా రెండోసారి కూడా ఆమె అమేథి నుంచి పోటీకి దిగారు. ఇందులో భాగంగా సోమవారం ఈ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు.

అంతకు ముందు ఉదయం తన ఇంట్లో, స్థానికంగా ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, భర్త జుబిన్ ఇరానీతో కలిసి ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ దాఖలు నేపథ్యంలో స్మృతి ఇరానీ ఆదివారం అయోధ్యలోని రామ మందిరాన్ని కూడా సందర్శించారు.

# ఓటరు స్లిప్ ల పంపిణీని వేగవంతం చేయాలి..

**మండల తహశీల్దార్ నాగరాజు..**



దొర్నిపాడు, ఏప్రిల్: 29, శ్రీ ప్రస్థానం న్యూస్:- ఓటర్ స్లిప్ ల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల తాసిల్దార్ నాగరాజు బి ఎల్ ఓ.లకూ సూచించారు.. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో కొనసాగుతున్న ఓటర్ స్లిప్ ల పంపిణి నీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.. ఈ సంధర్బంగా తాసిల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బి ఎల్ ఓ.లు ప్రతి గడప గడపకు వెళ్ళి క్రమ సంఖ్య ప్రకారం ఓటర్లకు ఓటర్ స్లిప్, లను అందజేయాలన్నారు.. మండలం వ్యాప్తంగా 20,280 కి పైగా ఓటర్లు ఉండగా సోమవారం నాడు సుమారు 3,322 పైగా ఓటర్ స్లిప్, లను పంపిణీ చేసినట్లుగా ఆయన తెలిపారు మిగిలిన 16,965 ఓటర్ స్లిప్, లను ఓటర్ లకు త్వరగా పంపిణీ చేయాలని తహశీల్దార్ నాగరాజు బి ఎల్ ఓ.లకు అదేశించారు.... ఓటరు సులువుగా పోలింగ్ కేంద్రాలను గుర్తించేలా ఓటర్ స్లిప్ వెనుక భాగాన రూట్ మ్యాప్ కూడా ముద్రించి ఉండటంతో పోలింగ్ కేంద్రాలను సులువుగా చేరుకునేలా వేసుల బాటు కల్పించిందన్నారు... ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది బి ఎల్ ఓ,లు పాల్గొన్నారు...

## నెరడుప్పలలో సిఐ రామకృష్ణయ్య పల్లెనిద్ర



గోనెగండ్ల : ఏప్రిల్ 29: జరగబోయే ఎన్నికల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు. సోమవారం నెరుడుప్పాల గ్రామం లో ప్రజలను సమావేశ పరిచి వారికి ఎలక్షన్స్ రూల్స్ గురించి వివరించి అలాగే గ్రామం లో సమస్యలను తెలుసుకొని, పరిష్కరించాలని, నేరుడుప్పల గ్రామంలో రాత్రి గ్రామ సచివాలయం లో పల్లెనిద్రలో భాగంగా ఇక్కడ నిద్రించడం,ఎలాంటి అల్లర్లు జరగకుండా చూసుకోవాలని సిఐ రామకృష్ణయ్య తెలిపారు.

## పవన్ కళ్యాణ్ అఫిడవిట్‌లో అబద్ధాలు

**పోతిన వెంకట మహేశ్ మరోసారి విమర్శలు**

విజయవాడ,ఏప్రిల్29: పవన్ కళ్యాణ్ ఎన్నికల అఫిడవిట్ నిండా పచ్చి అబద్ధాలు, మోసాల చిట్టా ఉందని, విజయవాడ పశ్చిమ టికెట్ దక్కకపోవడంతో జనసేన పార్టీకి గుడ్ బై చెప్పి వైసీపీలో చేరిన పోతిన వెంకట మహేశ్ మరోసారి పవన్ కళ్యాణ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 2014లో జనసేన పార్టీ పెట్టిన తర్వాతనే పవన్ కళ్యాణ్ ఆస్తులు బాగా కొనుగోలు చేశారని, ఆయనకు సినిమా రంగం కంటే రాజకీయ రంగమే బాగా కలిసొచ్చినట్టుగా అర్థమవుతోందని చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆయనకు బాగా లాభాలు వచ్చాయని, చంద్రబాబు ఇచ్చిన ప్యాకేజితో ఆస్తులు కొనుగోలు చేసినట్టు స్పష్టమవుతోందని పోతిన మహేశ్ ఆరోపించారు. పవన్ కళ్యాణ్ నటించిన గత 4 చిత్రాల్లో రెండు ఫెయిల్ అయ్యాయని, రెండు యావరేజ్‌గా ఆడాయని అన్నారు. పవన్ అఫిడవిట్‌లో తన ఆస్తుల విలువ రూ.90 కోట్లుగా చూపించారని, కానీ మార్కెట్ రేటును ఎక్కడా చూపించలేదని విమర్శించారు. మార్కెట్ రేటు ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ.400 నుంచి రూ.450 కోట్లు ఉంటుందని అన్నారు. పవన్ కళ్యాణ్ విద్యార్హత టెన్త్ క్లాస్ అనేది కూడా వివాదాస్పదమేనని పోతిన మహేశ్ అన్నారు. ఓ ఆస్తి విషయంలో ఆయన గిఫ్ట్ ఫ్రమ్ మదర్ అని రాశారని, మరి వారి తల్లిగారు ఇచ్చారా, దత్తత తల్లి ఇచ్చారా..? అనేది స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. పవన్ ఆదాయం రూ.114 కోట్లు, కట్టిన పన్ను రూ.67 కోట్లు కాగా.. ఇచ్చిన విరాళాలు రూ.20 కోట్లు పోతే మిగిలిన రూ.20 కోట్లతో రూ.90 కోట్ల విలువైన ఆస్తులు ఎలా కొన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సినిమాలకు తీసుకున్న అడ్వాన్సులను కూడా అప్పులుగా చూపించిన అపర మేధావి పవన్ కళ్యాణ్ అని పోతిన మహేశ్ అన్నారు. ఆయన ఆర్థిక మోసాలకు పాల్పడినట్టు చాలా స్పష్టంగా అర్థమవుతోందని చెప్పారు. అందుకే ఆయన అఫిడవిట్ మొత్తాన్ని ఒకసారి ఆదాయ పన్ను అధికారులు తనిఖీ చేయాలన్నారు. తేడా వస్తే శిక్ష కూడా వేయాలని డిమాండ్ చేశారు.

## తిరుపతి లో శృతి మించిన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారం

తిరుపతి,తిరుపతిలో ఎన్నికల ప్రచారం హద్దులు దాటుతోంది. వైసీపీ... జనసేన మధ్యన రెండు రోజులు గా ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగారు. జనసేన అభ్యర్థి అరణి శ్రీనివాసులు పై తిరుపతి ఎమ్మెల్యే భూమన్ కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. చిత్తూరు రౌడీ రాజ్యాన్ని పవిత్రమైన తిరుపతికి తీసుకురాకండి.తిరుపతి పవిత్రమైన పుణ్యక్షేత్రం.. ఇక్కడి ప్రజలు ప్రశాంతతను కోరుకుంటారు

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757